సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.20,600

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.20,600, కనిష్టంగా రూ.5 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.8, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

35.7°/09.2°

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. తెల్లవారుజామున చలి, మధ్యాహ్నం ఎండవేడి అధికమైంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

సీబీఆర్‌లో చేపల పెంపకానికి చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)లో చేపల పెంపకానికి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఇందుకు అవసరమైన అనుమతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన 'ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన స్కీం'పై డీఎల్సీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ, 'ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన' గురించి మత్స్యకారులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే డీఎల్సీ కమిటీ సభ్యుల్లో ఇద్దరు కచ్చితంగా మత్స్యకారులై ఉండాలన్నారు. ఇరిగేషన్ ట్యాంకుల్లో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మత్స్య సంపద వృద్ధితో ప్రజలకు పోషకాహారంతో పాటు ఎన్నో కుటుంబాలకు ఉపాధి లభిస్తుందన్నారు. చేపల పెంపకానికి ముందుకు వచ్చే మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, ఇతరులకు 30 శాతం రాయితీ ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఎల్‌డీఎం రమణకుమార్, వ్యవసాయ శాఖ జేడీ సుబ్బారావు, పశుసంవర్థక, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై పోక్సో కేసు

గోరంట్ల: విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఓ ప్రధానోపాధ్యాయుడిపై గోరంట్ల పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. సీఐ బోయ శేఖర్ తెలిపిన వివరాల మేరకు.. గోరంట్ల ఆర్కే థియేటర్ సమీపంలోని ఓ పాఠశాలలో నాగేశ్వరరావు (అంధుడు) ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కొద్ది కాలంగా పాఠశాలలోని కొందరు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించ సాగాడు. దీంతో మంగళవారం విద్యార్థినులు విషయాన్ని తల్లిదండ్రులకు తెలపడంతో వారంతా వచ్చి ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వారు నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో హెచ్ఎం నాగేశ్వరరావుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

ఎండుమిర్చి @16,500



మార్కెట్‌లో ఎండు మిర్చి విక్రయాలు

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. మంగళవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 142 క్వింటాళ్ల ఎండు మిర్చి రాగా, అధికారులు ఈ-నామ్ పద్ధతిలో వేలం పాటలు నిర్వహించారు. అందులో మొదటి రకం ఎండు మిర్చి క్వింటా రూ.16,500, రెండో రకం క్వింటా రూ. 9 వేలు, మూడో రకం క్వింటా ఎండు మిర్చి రూ.7 వేలు పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి . చంద్రమౌళి తెలిపారు. రెండు వారాలతో పోలిస్తే క్వింటా ఎండుమిర్చిపై రూ.1000 మేర ధర పెరిగింది.

ఆరోగ్యంపై దృష్టి సారించండి

- ఏఆర్ సిబ్బందికి ఎస్పీ రత్న సూచన



ప్లటూన్లను పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న సాయుధ బలగాల విభాగం (ఏఆర్) సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఎస్పీ రత్న అన్నారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో మంగళవారం ఏఆర్‌డీ మొబిలైజేషన్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ.. తొలుత ప్లటూన్లను పరిశీలించి, గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆమె మట్లాడుతూ.. పోలీస్ ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహించవచ్చన్నారు. అనంతరం మొబిలైజేషన్‌లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయకుమార్, ఆర్ఐలు వలి, మహేష్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

సూర్యప్రభపై ఖాద్రీశుడు

- కదిరిలో ఘనంగా రథసప్తమి వేడుకలు
- కిటకిటలాడిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న ఖాద్రీశుడు

కదిరి టౌన్: రథ సప్తమిని పురస్కరించుకుని మంగళవారం ఖాద్రీశుడు సూర్యప్రభ వాహనంపై తిరుమాడ వీధుల్లో దర్శనమిచ్చారు. స్వర్ణ, వజ్ర ఆభరణాలతో సర్వాలంకరణ భూషితుడైన కాటమరాయుడిని దర్శించుకుని భక్తులు తరించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, కర్ణాటక నుంచి భారీగా భక్త జనం తరలిరావడంతో లక్ష్మీనరసింహస్వామి ఆలయం కిటకిటలాడింది. శ్రీవారిని కీర్తిస్తూ గోవింద నామస్మరణ చేయగా కదిరి వీధులు మార్మోగాయి. అంతకుముందు అర్చకులు శ్రీరంగమండపంలో ఖాద్రీశుడిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం స్వామివారిని సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి. శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



విశేష అలంకరణలో అమ్మవారు



ఉట్ల జాతరను తిలకిస్తున్న జనం

ఉత్సాహంగా ఉట్ల జాతర

రొద్దం: మండల పరిధిలోని పెద్దమంతూరు సమీపాన పెన్నానది ఒడ్డున వెలసిన సుబ్రహ్మణేశ్వరస్వామి జాతర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఇక సాయంత్రం నిర్వహించిన ఉట్ల జాతర ఉత్సాహంగా సాగింది. ఉట్లమాను అధిరోహించడానికి యువకులు భారీగా పోటీపడ్డారు. పైనుంచి ఉప్పర కులస్తులు బంకమట్టి పోస్తుండగా ఉట్లమాను ఎక్కే యువత కిందపడుతూ, లేచి తిరిగి ప్రయత్నిస్తూ అందరికీ ఆహ్లాదం పంచారు. చివరకు కురుబ సామాజిక వర్గానికి చెందిన యువకుడు ఉట్లమాను అధిరోహించి విజయం సాధించారు. జాతరను తిలకించడానికి వివిధ ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

చింత తీరేనా?



తుపాను, ఆ తర్వాత విపరీతమైన చలి చింత రైతులను కలవరపాటుకు గురిచేశాయి. దిగుబడిని దెబ్బతీశాయి. కానీ సీజన్ ఆరంభంలోనే మంచి ధర దక్కుతుండటంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. కొత్త పంట ఆశించిన మేర మార్కెట్‌కు రాకపోవడంతో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచిన పాత సరుకుకూ మంచి డిమాండ్ ఏర్పడింది.

చింతపండుపైనే రైతుల ఆశలు

- తుపాను, చలి ప్రభావంతో తగ్గిన దిగుబడి
- కొత్త పంట అంతగా రాక పెరిగిన డిమాండ్
- సీజన్ ప్రారంభంలోనే క్వింటా రూ.14 వేలు పలికిన వైనం
- గత ఏడాది సరుకుకూ మంచి రేటు

హిందూపురం అర్బన్: రెండు, మూడేళ్లుగా రైతులను నిరాశపరిచిన చింతపండు...ఈ సారి వారి చింతలన్నీ తీర్చేలా కనిపిస్తోంది. ఆరంభంలోనే ఆశించిన ధర దక్కుతుండటంతో రైతు మోములో ఆనందం వికసిస్తోంది.

దిగుబడి తగ్గినా....

ఈ ఏడాది చింత దిగుబడిపై తుపాను, మంచు ప్రభావం తీవ్రంగా చూపింది. ఫలితంగా చింత ఫలసాయం 40 నుంచి 45 శాతం వస్తుందని అంచనా వేస్తున్నారు. దీంతో రైతులు పూర్తి నిరాశ చెందారు. అయితే సరుకు కొద్దిగా రావడం..డిమాండ్ పెరగడంతో ధర ఎగబాకింది. సీజన్ ఆరంభంలోనే క్వింటా ఏకంగా రూ.14 వేలు పలికింది. దీంతో దిగుబడి తగ్గినా రేటు బాగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ధర లేక..కోల్డ్ స్టోరేజీలో నిల్వలు

రెండేళ్లుగా మార్కెట్‌లో చింత పండుకు సరైన ధరలు లేవు. దీంతో వ్యాపారులు హిందూపురం, పరిగి, మడకశిర ప్రాంతాల్లోని కోల్డ్ స్టోరేజీల్లో 700 లారీలకుపైగా (70 వేల క్వింటాళ్లు) కరిపులి, ఫ్లవర్, బోటు రకాలకు చెందిన చింత పండు నిల్వలు ఉంచారు. అయితే గత ఏడాది ఆగస్టు నుంచి ధర కాస్త పెరగడంతో సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో దాదాపు 100 లారీల సరుకును పలు నగరాలకు రవాణా చేశారు. ఇంకా నిల్వ ఉన్న 60 వేల క్వింటాళ్ల చింతపండు ఇప్పుడిప్పుడే కదులుతోంది.

ఏటా లక్ష క్వింటాళ్ల విక్రయాలు

హిందూపురం వ్యవసాయ మార్కెట్ చింత పండు విక్రయాలకు పేరుగాంచింది. గత కొన్నేళ్లుగా చింతపండుకు మంచి ధర లభిస్తుండటంతో మన రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర తదితర ప్రాంతాల రైతులూ ఇక్కడికే సరుకు తెచ్చి విక్రయిస్తున్నారు. అందువల్లే మార్కెట్‌కు ఏటా లక్ష క్వింటాళ్ల చింత వస్తోంది. ఇందులో జిల్లాలోని మడకశిర, హిందూపురం, కదరి నియోజకవర్గాల నుంచి దాదాపు 25 వేల క్వింటాళ్ల సరుకు ఇక్కడికి వస్తోంది. మరో 50 వేల క్వింటాళ్లు కర్ణాటక ప్రాంతాల నుంచి, మిగతా సరుకు వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తుంటుంది. ఇక్కడి వ్యాపారులు సరుకును దేశంలో ప్రధాన నగరాలైన బెంగళూరు, చెన్నై, కొచ్చి, కోల్‌కతా, ముంబై, ఢిల్లీలకు సరఫరా చేస్తుంటారు. అందువల్లే ఏటా మార్కెట్‌కు కమీషన్ రూపంలోనే రూ.90 లక్షలకుపైగా ఆదాయం సమకూరుతోంది. ఈసారి మన వద్ద దిగుబడి తగ్గినా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుంచి ఆశించిన స్థాయిలో హిందూపురం మార్కెట్‌కు సరుకు వస్తుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. గత మూడేళ్ల క్రయవిక్రయాలను పరిశీలిస్తే మన ప్రాంతంలో పంట తక్కువగా ఉన్నా.. మార్కెట్‌కు ఇతర రాష్ట్రాల నుంచి చింత పండు ఉత్పత్తులు వస్తుండటంతో ఏటా లక్ష క్వింటాళ్లకుపైగా పండు మార్కెట్‌కు వస్తోంది. ఈ ఏడాది కూడా లక్ష క్వింటాళ్ల దాటి మార్కెట్‌కు వస్తుందని అంచనా. తద్వారా మార్కెట్‌కు ఫీజు రూపంలో భారీగా సమకూరనుంది.



హిందూపురం మార్కెట్‌కు గత మూడేళ్లుగా వచ్చిన చింత పండు, కమీషన్ ఇలా..

ఏడాది	మార్కెట్‌కు వచ్చిన సరుకు (క్వింటాళ్లు)	విలువ (రూ.లక్షల్లో)	మార్కెట్ ఫీజు (రూ.లక్షల్లో)
2021-22	1,01,152	7,425	74.25
2022-23	1,06,034	8,044	80.44
2023-24	1,13,204	9,608	96.08

దిగుబడి తగ్గినా ధర బాగుంది



ఈ సారి చింత దిగుబడి తగ్గినా... ధర బాగా పలుకుతోంది. సీజన్ ప్రారంభంలోనే క్వింటా రూ.14 వేలు పలికింది. వ్యాపారులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు. రానున్న రోజుల్లో ధర మరింత పెరగనుంది. అందువల్లే చింత రైతులు నిశ్చింతగా ఉండొచ్చని చెబుతున్నాం.

– శ్రీకాంత్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు, హిందూపురం

కొత్త పంట ఇప్పుడిప్పుడే వస్తోంది



మార్కెట్‌కు కొత్తపంట ఇప్పుడిప్పుడే వస్తోంది. ప్రతి సోమ, గురువారాల్లో చింత పండు క్రయవిక్రయాలు జరగనుండగా.. డిమాండ్ మేరకు సరుకు వస్తుందని అంచనా వేస్తున్నాం. ఈ సారి లక్ష క్వింటాళ్లకుపైగా చింతపండు మార్కెట్‌కు వస్తుందని భావిస్తున్నాం . తదనుగుణంగా ఏర్పాట్లు చేశాం.

– కిషోర్‌కుమార్, మార్కెట్ ఇన్‌చార్జ్ కార్యదర్శి, హిందూపురం

నిబంధనలు ఉల్లంఘిస్తే ఏజెన్సీ రద్దు

- గ్యాస్ సిలిండర్‌పై రూపాయి కూడా అదనంగా తీసుకోకూడదు
- ఎక్కడైనా వసూళ్లు చేస్తే 08555-289039 నంబరుకు ఫిర్యాదు చేయండి
- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



'దీపం పథకం-2' అమలుపై సమీక్షిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: 'దీపం-2' పథకాన్ని జిల్లాలో పక్కాగా అమలు చేయాలని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే సదరు గ్యాస్ ఏజెన్సీ గుర్తింపు రద్దు చేస్తామని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హెచ్చరించారు. అలాగే గ్యాస్ సిలిండర్ డెలివరీకి రూపాయి వసూలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో పుట్టపర్తి మండల పరిధిలోని గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో 'దీపం-2' పథకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, 'దీపం-2' పథకం లబ్ధిదారులకు సకాలంలో సబ్సిడీ మొత్తం జమ కావడం లేదని, ఉచిత గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో అదనంగా రూ.80 నుంచి రూ.150 వరకు కొన్ని గ్యాస్ ఏజెన్సీలు వసూలు చేస్తున్నాయన్న ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా ఫిర్యాదులపై విచారణ జరుపుతున్నామని, ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత ఏజెన్సీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టి లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. గ్యాస్ డెలివరీ సమయంలో బాయ్‌లు అదనంగా వసూలు చేస్తే 08555-289039 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

వైఎస్సార్ సీపీ నుంచి ఐదుగురి సస్పెన్షన్

అనంతపురం కార్పొరేషన్: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఐదుగురిని వైఎస్సార్ సీపీ నుంచి సస్పెండ్ చేశారు. అందుకు సంబంధించి మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు పార్టీ అధ్యక్షుడి ఆదేశానుసారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సస్పెన్షన్ అయిన వారిలో భూమిరెడ్డి మహానందరెడ్డి (ప్రసన్నాయపల్లి, రాప్తాడు), మద్దిరెడ్డి శివారెడ్డి (అనంతపురం రూరల్), బోయ నరేంద్ర అలియాస్ రాజారాం (ముద్దినేనిపల్లి, కళ్యాణదుర్గం మండలం), పొట్టే రమేష్(కుంటిమద్ది, రామగిరి మండలం), కురుబ ముత్యాలు (నసనకోట, రామగిరి మండలం) ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు


- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం

ప్రశాంతి నిలయం: వేసవిలో జిల్లాలోని ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్సు హాలులో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ శాఖల అధికారుతో సమీక్షించారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు ప్రణాళికలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ, గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జునను ఆదేశించారు. తాగునీటి పనుల కోసం ప్రాథమిక నిర్వహణ పనుల నిధులను వినియోగించుకోవాలని డీపీఓ సమతకు సూచించారు. అందరూ ఎంపీడీఓలతో సమన్వయం చేసుకుని సరైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యను ఆదేశించారు. తాగునీటి సమస్యల పరిష్కారం కోసం జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీల వారీగా సమస్యలు, నీటి కొరత ఉన్న గ్రామాల జాబితాను వచ్చే వారంలో పంపాలని సూచించారు. సమావేశంలో ఉమ్మడి వ్యవసాయ శాఖ జేడీ సుబ్బారావు, డీఈఓ కృష్ణప్ప, డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం, ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జలవనరుల శాఖ అధికారి రాజశేఖర్‌తో పాలు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో చోరీ

రామగిరి: నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో చోరీ జరిగింది. ఆలయంలో మూడు హుండీలుండగా, సోమవారం అర్ధరాత్రి దుండగులు ఒక హుండీని పగులగొట్టి నగదు దోచుకెళ్లారు. మంగళవారం ఉదయం అమ్మవారికి పూజలు చేసేందుకు వచ్చిన అర్చకులు హుండీ ధ్వంసమై ఉండటం చూసి... వెంటనే ఆలయ ఈఓ వెంకటేశ్వర్లుకు సమాచారం ఇచ్చారు. ఆయన ఆలయం వద్దకు చేరుకుని వివరాలు ఆరా తీశారు. అనంతరం రామగిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.లక్షకుపైనే నగదు చోరీ అయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

చాపకింద నీరులా క్షయ



- క్రమక్రమంగా విస్తరిస్తున్న వ్యాధి
- ఏడాదిలో 1,170 పాజిటివ్ కేసుల నమోదు

జిల్లాలో టీబీ పరీక్షలు, పాజిటివ్ కేసులు ఇలా..

సంవత్సరం	పరీక్షలు	పాజిటివ్ కేసులు
2023	2,336	1,430
2024	2,342	1,170

జిల్లాలో టీబీ యూనిట్ కేంద్రాలు

హిందూపురం అర్బన్, హిందూపురం రూరల్, ధర్మవరం, పెనుకొండ, కదిరి, తనకల్లు, బుక్కపట్నం, మడకశిర

వ్యాధి రకాలు : టీబీ, ఎండీఆర్, ఎక్స్‌డీఆర్.

- టీబీ సోకితే ఆరు నెలల మందులు వాడితే సరిపోతుంది.
- ఎండీఆర్ సోకితే దీర్ఘకాలం మందులు వాడాల్సి ఉంటుంది.
- ఎక్స్‌డీఆర్ సోకిన వారు మాత్రం ఆస్పత్రుల్లో చేరి డాక్టర్ల పర్యవేక్షణలోనే ఉండాలి.

సాక్షి, పుట్టపర్తి

క్షయ వ్యాధి జిల్లాలో చాపకింద నీరులా విస్తరిస్తోంది. వయసుతో సంబంధం లేకుండా అందరికీ సోకుతోంది. ఫలితంగా రోజురోజుకీ పాజిటివ్ కేసులు పెరిగిపోతున్నాయి. సకాలంలో చికిత్స చేయించుకోకపోవడం, పరీక్ష చేయించుకున్న తర్వాత పాజిటివ్ అని తేలినా మందులు సక్రమంగా వాడకపోవడం వంటి కారణాలతో బాధితుల సంఖ్య ఎక్కువ అవుతోంది. ఇతర వ్యాధులతో పోలిస్తే క్షయ ప్రమాదకరమని, మందులు సరిగా వాడకపోతే దీర్ఘకాలిక సమస్యగా మారడం ఖాయమని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

గాలి ద్వారా సులువుగా..

క్షయను వ్యవహారికంలో 'టీబీ'గా పిలుస్తారు. ఈ వ్యాధి మైక్రో బ్యాక్టీరియం ట్యూబర్ క్యులోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా సోకుతుంది. ఈ బ్యాక్టీరియా ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తుంది. గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి సులువుగా సంక్రమిస్తుంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో వేగంగా సంక్రమిస్తుంది. రోగి దగ్గినప్పుడు, ఉమ్మి వేసినప్పుడు, చీదినప్పుడు రోగకారక క్రిములు గాలిలోకి చేరుతాయి. తద్వారా మరొకరి శరీరంలోకి ప్రవేశిస్తాయి. క్షయ రోగి ఓసారి దగ్గితే సుమారు 40 వేల వరకు వ్యాధి కారక క్రిములు గాల్లో కలుస్తాయి. ప్రజల్లో అవగాహన లేని కారణంగా ఒకరి నుంచి మరొకరికి సులువుగా సోకుతోందని చెప్పవచ్చు.

నిండా ముంచుతున్న నిర్లక్ష్యం

క్షయను వైద్యులు వివిధ కేటగిరీలుగా విభజించారు. వ్యాధి తీవ్రతబట్టి ఆర్నెల్లు, ఏడాది, ఏడాదిన్నర పాటు మందులు వాడాల్సి ఉంటుంది. అయితే ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా.. ప్రమాదకరమే. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది చోట్ల క్షయ వ్యాధి యూనిట్లు ఉన్నాయి. రోగులు అక్కడికి వెళ్తే.. మందులు ఉచితంగా అందజేస్తారు. సకాలంలో డాక్టర్ల సలహాల మేరకు మందులు వాడితే వ్యాధి నియంత్రణలోనే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే చాలామంది రోగులు నిర్లక్ష్యం కారణంగా చికిత్స తీసుకోక ప్రాణాలు కోల్పోతున్నారు.



హిందూపురంలోని క్షయనివారణ కేంద్రం



వ్యాధిగ్రస్తున్ని పరీక్షిస్తున్న వైద్యుడు

అవగాహన కల్పిస్తున్నాం



క్షయ నివారణకు పకడ్బందీ ప్రణాళిక చేపడుతున్నాం. వ్యాధి సోకే విధానం, ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. దీర్ఘకాలికంగా దగ్గు ఉన్నా.. ఆకలి మందగించినా.. బరువు తగ్గినా.. వెంటనే సమీపంలోని పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకుంటే మంచిది. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. ఒకరి నుంచి సగటున మరో 15 మందికి సోకే ప్రమాదం ఉంది.

– డాక్టర్ తిప్పయ్య, జిల్లా క్షయ నివారణాధికారి

క్లుప్తంగా

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యం



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం

పుట్టపర్తి రూరల్: ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం అన్నారు. మంగళవారం ఎనుములపల్లి పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. అనంతరం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహణ పెంచుకోవాలన్నారు. మంచి అలవాట్లు, ఆరోగ్యకరమైన ఆహారంతో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ చేపడతామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోత్స్న, మునిచంద్రిక, భవ్య, సామాజిక కార్యకర్త నగేష్, సిబ్బంది లలిత, చంద్రకళ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



అపర్ణ (ఫైల్)

పావగడ: లైంగిక వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... పావగడ తాలూకా క్యాతనచెర్లు గ్రామానికి చెందిన నరసింహకు ఆరేళ్ల క్రితం వల్లూరు గ్రామానికి చెందిన అపర్ణ (26)తో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ క్రమంలో అపర్ణపై కన్నేసిన అదే గ్రామానికి చెందిన రామాంజినరెడ్డి అలియాస్ సన్నప్పయ్య కొంత కాలంగా ఆమెను లైంగిక వేధింపులకు గురి చేస్తూ వస్తున్నాడు. తన కోరిక తీర్చకపోతే మార్ఫింగ్ చేసిన వీడియోలను వైరల్ చేసి పరువు తీస్తానంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో విషయాన్ని భర్తకు తెలపడంతో కుటుంబసభ్యులతో కలసి రామాంజినరెడ్డిని నరసింహ తీవ్రంగా మందలించాడు. అయినా అతనిలో మార్పు రాలేదు. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో మనస్తాపం చెందిన అపర్ణ సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త నరసింహ ఫిర్యాదు మేరకు తిరుమణి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

పరిమాణంలో చిన్న... ప్రయోజనాలు మిన్న



ఏపుగా పెరిగిన కొర్రపంట

- చిరుధాన్యాల సాగుపై రైతుల ఆసక్తి
- తక్కువ పెట్టుబడి.. ఎక్కువ ఆదాయం
- సేంద్రియ ఎరువులతో పంటల సాగు

చెన్నేకొత్తపల్లి: చిరుధాన్యాలు పరిమాణంలో చూసేందుకు చిన్నగా ఉన్నా... వాటి ప్రయోజనాలు మాత్రం చాలా గొప్పవి. న్యూట్రియెంట్లు మెండుగా ఉండి మెరుగైన ఆరోగ్యానికి దోహదపడతాయి. వీటివల్ల శరీరంలో రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. ఈ చిన్న గింజల్లో దాగి ఉన్న సూపర్ పవర్ ఏమిటో తెలిసిన అనంతరం వినియోగం కూడా భారీగా పెరిగింది. ఈ క్రమంలో చిరుధాన్యాల సాగుపై కొన్నేళ్లుగా రైతుల్లో ఆసక్తి పెరుగుతూ వస్తోంది.

మారిన ఆహారపు అలవాట్లతో ముప్పు

కొన్నేళ్ల క్రితం వరకు బీపీ, షుగర్.. వంటి వ్యాధులు అరవై ఏళ్లు నిండిన వారిలోనే కనిపించేవి. కానీ ఇప్పుడు పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా మారిపోయింది. పాతికేళ్లకే బీపీ, ముప్పై ఏళ్లకే గుండె జబ్బులు వచ్చేస్తున్నాయి. మారిన ఆహారపు అలవాట్లే ఇందుకు కారణమని నిపుణులు అంటున్నారు. ఆరోగ్యకరమైన పూర్వీకుల ఆహారపు అలవాట్లు మనల్ని తాజాగా, ఉత్సాహంగా ఉంచడమే కాకుండా, దీర్ఘాయువుని పెంచుతాయనేది శాస్త్రీయంగానూ నిరూపితమైంది. చిరుధాన్యాలను వినియోగించడం వల్ల పూర్వీకుల ఆరోగ్యం మెరుగుగా ఉండంతో పాటు వారి జీవితకాలం కూడా ఎక్కువగా ఉండేది. మారిన కాలనుగుణంగా మనిషి ఆహారపు అలవాట్లలోనూ విపరీత పోకడలు చోటు చేసుకున్నాయి. యాంత్రిక జీవనానికి అలవాటు పడి జంక్ ఫుడ్స్‌తో కాలం నెట్టుకోస్తూ అనారోగ్యాల బారిన పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో మరోసారి చిరుధాన్యాల అవశ్యకత తెరపైకి వచ్చింది. ఎన్నో పోషకాలున్న చిరుధాన్యాలను ఆహారంగా తీసుకునేవారి సంఖ్య క్రమేణ పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో చిరుధాన్యాల సాగుపై రైతుల్లోనూ ఆసక్తి పెరిగింది.

'టింబక్టు' సహకారంతో

చిరుధాన్యాల సాగుకు ముందుకు వచ్చే రైతులకు చెన్నేకొత్తపల్లి మండలంలోని టింబక్టు కలెక్టివ్ సంస్థ అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ వస్తోంది. జిల్లాలోని చెన్నేకొత్తపల్లి, రామగిరి, రొద్ద, కనగానపల్లి, బుక్కపట్నం, మడకశిర మండలాలతో పాటు అనంతపురం జిల్లాలోని కంబదూరు శింగనమల మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, చిరుధాన్యాల సాగుకు ముందుకు వచ్చే రైతులను ఓ సంఘంగా ఏర్పాటు చేసి ధరణి అనే సొసైటీ కింద చేర్చి ఉచితంగా చిరుధాన్యాలను అందజేస్తోంది. కొర్ర, సామలు, ఊదరలు, అరికలు, సద్దలు, జొన్నలు, రాగి, అండుకొర్ర తదితర విత్తనాలను అందజేస్తోంది. అనంతరం రైతులు పండించిన చిరుధాన్యాలను గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేస్తోంది. దాదాపు 380 నుంచి 400 ఎకరాల్లో ధరణి సొసైటీ కింద రైతులు చిరుధాన్యాల సాగు చేపట్టారు.



కొర్ర పంటను పరిశీలిస్తున్న మహిళా రైతులు

చిరుధాన్యాల సాగుకు పెట్టుబడులు చాలా తక్కువగా ఉంటాయని రైతులు అంటున్నారు.

పెట్టుబడి తక్కువ

ఎకరా విస్తీర్ణానికి మూడు కిలోల విత్తనం అవసరమవుతుందని పేర్కొంటున్నారు. ఎద్దులతో సేద్యం చేయడం, సేంద్రియ ఎరువులను వాడడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునంటున్నారు. పంట కాలం పూర్తయిన తర్వాత ఎకరాకు ఎంత లేదన్నా 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి కచ్చితంగా ఉంటుందంటున్నారు. విత్తు సమయంలో సరైన వర్షాలు కురిస్తే దిగుబడి మరింత పెరుగుతుందన్నారు. చీడపీడలు ఆశిస్తే వావిళ్ల కషాయం, పంచపత్ర కషాయం, గింజ నాణ్యతకు పంచగవ్యను వాడుతామని వివరించారు.

అనారోగ్య సమస్యలు తీరాయి



చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం మొదలు పెట్టిన తర్వాత చాలా అనారోగ్య సమస్యలు తీరాయి. చిన్నపాటి రుగ్మతలు దూరం కావడంతో మందుల వినియోగం పూర్తిగా తగ్గింది. ప్రస్తుతం ఎంతో ఆరోగ్యంగా రోజంతా యాక్టివ్‌గా ఉండగలుగుతున్నా.

– రమణారెడ్డి, ఉపాధ్యాయుడు, ఒంటికొండ, చెన్నేకొత్తపల్లి మండలం

రోజంతా ఉత్సాహమే



విధుల నిర్వహణ ఒత్తిళ్లతో గతంలో చాలా త్వరగా అలసి పోయేవాడిని. ఏమైందో తెలియక చికిత్సల కోసం ఆస్పత్రుల చుట్టూ తిరిగాను. అయినా ఫలితం దక్కలేదు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం మొదలు పెట్టిన తర్వాత ఈ సమస్య తీరింది. ఇప్పుడు అలసట అనేది తెలియడం లేదు. రోజంతా ఉత్సాహంగా ఉండగలుగుతన్నా.

– జయరాం, ఐటీఐ ప్రిన్సిపాల్, చెన్నేకొత్తపల్లి మండలం

భక్తులతో పోటెత్తిన బూదగవి





దర్శనానికి బారులు తీరిన భక్తులు (ఇన్‌సెట్‌లో) విశేష అలంకరణలో బూదగవి సూర్యభగవానుడి మూలవిరాట్

ఉరవకొండ: రాష్ట్రంలోనే రెండో సూర్యదేవాలయంగా ఖ్యాతిగాంచిన బూదగవి సూర్యదేవాలయం రథసప్తమి సందర్భంగా భక్తులతో పోటెత్తింది. జిల్లా నలమూలల నుంచే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి దర్శనం కోసం వేకువ జామునుంచే భక్తులు బారులు తీరారు. తెల్లవారుజామున ఆలయంలో విశేష అభిషేకాలు, అలంకరణలు జరిగాయి. కలశ ప్రతిష్ట మహాగణపతి, నవగ్రహ హోమాలు నిర్వహించారు. అనంతరం ఛాయ, ఉష సమేత సూర్యనారాయణస్వామి కల్యాణోత్సవాన్ని వేదమంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు.

ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై శిక్షణ

పుట్టపర్తి: జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఒకేషనల్, సైన్స్ అధికారులకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. పరీక్షా విధివిధానాలపై అవగాహన కల్పించారు. బుధవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకూ ఒకేషనల్, రెగ్యులర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పరీక్షల కన్వీనర్ రఘునాథరెడ్డి, ప్రత్యేకాధికారి చెన్నకేశవ ప్రసాద్, కమిటీ మెంబర్లు సురేష్‌బాబు, రామరాజు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

హంద్రీ–నీవా కాలువను వెడల్పు చేయాల్సిందే

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



హెచ్ఎన్ఎస్ఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: హంద్రీ–నీవాను ఓటు బ్యాంక్ కోసం వాడుకుని అధికారం చేపట్టిన తర్వాత నిర్వీర్యం చేసే కుట్రకు సీఎం చంద్రబాబు తెరలేపారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. హంద్రీ–నీవా కాలువను వెడల్పు చేసేంత వరకూ తమ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలంటూ మంగళవారం హెచ్ఎన్ఎస్ఎస్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆందోళనకు అఖిలపక్షం నేతలు మద్దతు తెలిపారు. సీపీఐ రామకృష్ణ మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా మల్యాల వద్ద నుంచి హంద్రీ–నీవా కాలువను వెడల్పు చేసి చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందిస్తామంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ నిచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి కాలువకు లైనింగ్ పనులు చేపట్టే కుట్రకు తెరలేపారన్నారు. దీని వల్ల కాలువ పరిసరాల్లో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పది వేల క్యూసెక్కులకు పెంచి ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు. 30 లక్షల మందికి తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేస్తున్నామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప, మానవహక్కుల సంఘం నాయకులు బాషా, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు నాగరాజు, సీపీఐ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, కార్యదర్శి వర్గ సభ్యుడు రాజారెడ్డి, కేశవరెడ్డి, శ్రీరాములు, రామకృష్ణ, వీరభద్రస్వామి, రైతు సంఘం అధ్యక్షుడు చెన్నప్పయాదవ్, నాయకులు నారాయణస్వామి, రమణయ్య, లింగమయ్య, రమేష్, రాము, రామదాసు, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్, సీటు బెల్టుతో ప్రాణాలకు రక్ష

- రహదారి భద్రతా మాసోత్సవాల్లో ఎస్పీ రత్న
- మహిళలతో కలసి ధర్మవరంలో బైకు ర్యాలీ



హెల్మెట్ ధరించి బైకు ర్యాలీ చేస్తున్న జిల్లా ఎస్పీ రత్న, మహిళా పోలీసులు



క్రీడా మైదానంలో హెల్మెట్ ధరించాలని సూచిస్తున్న జిల్లా ఎస్పీ రత్న

ధర్మవరం అర్బన్: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించి ప్రయాణం చేయాలని, తద్వారా ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలకు రక్షణ ఉంటుందని ఎస్పీ వి.రత్న తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్పీ రత్న, పలువురు మహిళా పోలీసులు, స్థానిక మహిళలు హెల్మెట్‌లు ధరించి బైకు ర్యాలీ నిర్వహించారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ప్రారంభమైన బైక్ ర్యాలీ కాలేజి సర్కిల్, కళాజ్యోతి సర్కిల్, పీఆర్‌టీ సర్కిల్, గాంధీనగర్ సర్కిల్ వరకూ కొనసాగింది. అనంతరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ రత్న మాట్లాడారు. వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణహాని ఉండదన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదన్నారు. మైనర్లు వాహనాలు ఇవ్వరాదని, ఎవరైనా మైనర్ వాహనంలో రోడ్డెక్కితే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడిపితే ఆరునెలల జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. అతివేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తోనే ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. వాహనదారులంతా రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదరహిత ప్రయాణం చేయాలని సూచించారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎస్పీ హేమంత్‌కుమార్, ట్రైనీ డీఎస్పీ పావని, వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, టూటౌన్ సీఐ రెడ్డప్ప, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులుతో పాటు పలువురు ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, సచివాలయ మహిళా పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎంపిక



ల్యాబ్ టెక్నీషియన్ల జిల్లా కార్యవర్గం

పుట్టపర్తి అర్బన్: ల్యాబ్ టెక్నీషియన్ జిల్లా అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు రఘుబాబు ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ సమక్షంలో మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జనార్దన్, సెక్రెటరీగా మస్తాన్‌వలీ, ట్రెజరర్‌గా అనిల్‌నాయక్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నాగభూషణ, వైస్ ప్రెసిటెండ్‌గా సునీత ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక ఆర్‌వీజే కల్యాణ మంటపంలో జరిగిన ఈ ప్రక్రియ అనంతరం సభ్యులు సమావేశమై పలు తీర్మానాలు చేశారు. అనంతరం డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగంను కలసి సమస్యల పరిష్కారానికి వినతి పత్రాన్ని అందజేశారు.

కారు దగ్ధం



చిలమత్తూరు: మండల కేంద్రంలోని బైరేకుంట చెరువు వద్ద ఓ కారు దగ్ధమైంది. పోలీసులు తెలిపిన మేరకు... బైరేకుంట వద్ద ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు డ్రైవర్ తెలిపాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ మునీర్ అహమ్మద్ అక్కడకు చేరుకుని పరిశీలించారు.

ప్రశ్నించే గొంతుకను నొక్కుతారా?



ఎండోమెంటు కార్యాలయం వద్ద మాట్లాడుతున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: సమాజంలో అందరూ బాగుండాలని ఆశీర్వ వచనాలు పలికే అర్చకుల సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధించడం సరి కాదని అర్చక పురోహితులు మండిపడ్డారు. ఎండోమెంటు సహాయ కమిషనర్ ఆదిశేషునాయుడు విధానాలను తప్పుబడుతూ ప్రభుత్వ తీరుపై మంగళవారం జిల్లా అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో పలువురు అర్చకులు, పురోహితులు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు మాట్లాడుతూ.. ఎండోమెంటు అధికారుల నిర్లక్ష్యాన్ని, అవినీతిని ఎండగడుతూ గత నెల 22న ధర్నా చేశామని గుర్తు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారన్నారు. ఈ విచారణ మంగళవారం జరగాల్సి ఉండగా... ఇతర పనుల ఒత్తిడి వల్ల విచారనాధికారి హాజరు కాలేకపోయారన్నారు. దీంతో వారం రోజుల అనంతరం డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ సాగుతుందని తెలిపారు. ఈ లోపు విడపనకల్లు మండలం పాల్తూరులో వెలసిన బండ వీరభద్రస్వామి ఆలయ అర్చకులను ఎండోమెంటు కార్యాలయానికి ఏసీ పిలిపించుకుని రెచ్చగొట్టి కేసులు బనాయించడం దారుణమన్నారు. ఏసీ దౌర్జన్యాలపై తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య ఉమ్మడి జిల్లా నాయకులు శ్రీనివాసులు, తిరుపతయ్య, వీరాంజనేయులు, హనుమంతరాయుడు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రికిరాత్రే ప్రైవేట్ స్థలంలో సీసీ రోడ్డు ఏర్పాటు



పోలీసులు దగ్గరుండి రోడ్డు పనులు పూర్తి చేయిస్తున్న దృశ్యం

గోరంట్ల: మండలంలోని శెట్టిచిన్నంపల్లి లో ప్రైవేట్ వ్యక్తులకు చెందిన పట్టా స్థలంలో రాత్రికి రాత్రే సీసీ రోడ్డును అధికారులు ఏర్పాటు చేశారు. స్థానిక టీడీపీ నేతకు సౌకర్యం కల్పించేందుకు అధికారులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లుగా బాధితులు వాపోయారు. వివరాలు... బూదిలి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 83-1,83-2 లో 7.79 సెంట్ల భూమి నరసింహరెడ్డి, గంగిరెడ్డి, నంజిరెడ్డి, లక్ష్మీదేవమ్మ, అశ్వత్థమ్మకు పూర్వీకుల నుంచి సంక్రమించింది. ఇందులో 2 ఎకరాలు చౌడమ్మ అనే మహిళకు విక్రయించారు. మిగులు భూమిలో కొంత మేర ఇతరులకు విక్రమించి నాలుగు అడుగుల ప్లాన్ మార్కుతో రోడ్డు మార్క్ చేయించారు. అయితే పది అడుగుల పొడవుతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ పథకం రూ.5 లక్షల వ్యయంతో పనులను పీఆర్ అధికారులు చేపట్టారు. దీంతో రైతులు మంగళవారం హైకోర్టును ఆశ్రయించడంతో నాలుగు వారాల పాటు పనులు చేపట్టరాదని ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే టీడీపీకి చెందిన ఓ నేత... అధికారులు, పోలీసులను అడ్డు పెట్టుకుని రాత్రికి రాత్రి సీసీ రోడ్డు పనులు చేపట్టి పూర్తి చేయించడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేధింపుల కేసు నమోదు

ధర్మవరం అర్బన్: తనను అత్తింటి వారు వేధిస్తున్నారంటూ ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన వివాహిత హరిత చేసిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్త, మామ, మరిది, ఆడపడుచుపై 498–ఏ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు. హరితకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఆడపిల్లలకు జన్మనివ్వడంతో తనకు విడాకులు ఇవ్వాలని లేకపోతే రూ.5లక్షలు అదనపు కట్నం తేవాలని హరితను భర్త రమేష్‌నాయుడు, అత్త లక్ష్మీదేవి, మామ నారాయణ, మరిది కోటేశ్వరరావు, ఆడపడుచు రాజేశ్వరి వేధింపులకు గురి చేస్తూ వచ్చారు. గృహహింస భరించలేక హరిత మంగళవారం ఫిర్యాదు చేయడంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏపీలో కులగణన చేపట్టాలి



ఎస్.రఘువీరారెడ్డి

మడకశిర: ఏపీలో కులగణన చేపట్టాలని సీడబ్ల్యూసీ సభ్యుడు ఎస్.రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టి కులగణన చేయడం ఒక చరిత్రాత్మక విషయమన్నారు. అదే తరహాలో ఏపీలోనూ కులగణన చేపట్టాలన్నారు.

సత్యసాయి చెంత.. చైనీస్ వేడుక



చైనీస్ సంప్రదాయ సాంస్కృతిక ప్రదర్శన



సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న చైనీయులు



చైనీస్ సంప్రదాయ పూజా క్రతువులు నిర్వహిస్తున్న సత్యసాయి ట్రస్ట్ సభ్యులు, చైనీస్ భక్తులు

ప్రశాంతి నిలయం: చైనా నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతి నిలయంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చైనా సంప్రదాయ రీతిలో సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌రాజు, సభ్యుడు చక్రవర్తి, వేడుకల కో–ఆర్డినేటర్ జాక్వలిన్ హో పాల్గొన్నారు. అనంతరం జోన్–5 దేశాల భక్తులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. మలేషియాకు చెందిన సత్యసాయి భక్తుల సంగీత కచేరి అలరించింది. అంతకు ముందు వేడుకలను ఉద్దేశించి జాక్వలిన్ హో ప్రసంగించారు.